క్లుప్తంగా

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు



మూడులాంతర్లు జంక్షన్ వద్ద పైప్‌లైన్ లీకేజీ పనులు పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాసరావు

విజయనగరం: నగరంలో అక్కడక్కడ ఏర్పడిన పైప్‌లైన్ లీకేజీలకు ఇంజినీరింగ్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. స్థానిక మూడు లాంతర్లు జంక్షన్ వద్ద చేపడుతున్న పైప్‌లైన్ మరమ్మతు పనులను డీఈ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైప్‌లైన్‌లకు లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

ఒకే ఒక్క వినతి..



వినతి స్వీకరిస్తున్న అధికారులు

విజయనగరం: స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఒక వినతి మాత్రమే వచ్చింది. కమిషనర్ పల్లి నల్లనయ్య వినతి స్వీకరించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను త్వరగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ టి.రాయల్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టౌన్ సర్వేయర్ సింహాచలం పాల్గొన్నారు.

పరామర్శ



అప్పలనర్సింహ నాయుడు భౌతిక ఖాయానికి నమస్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని చల్లవానితోట గ్రామంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు సోదరుడు అప్పలనర్సింహ నాయుడు(90) వయోభారంతో సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మహంతి చిన్నంనాయుడు, పతివాడ అప్పలనాయుడు, మహంతి శంకరరావు, పతివాడ అప్పలనారాయణ తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సారిపల్లిలో భక్తి సంకీర్తన



భక్తి సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్వామి సన్నిధిలో భక్తులు భక్తి సంకీర్తనలను సోమవారం ఆలపించారు. వచ్చేనెల 9వ తేదీన శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరగనుందని, అప్పటి వరకు భక్తి సంకీర్తనాలాపనలు నిర్విరామంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. అదేరోజు వీర బ్రహ్మేంద్ర స్వామి శాంతి కల్యాణం జరిపించి, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

సజ్జలను కలిసిన రామారావు



సజ్జల రామకృష్ణారెడ్డితో మాట్లాడుతున్న సముద్రపు రామారావు

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధుల రాష్ట్రస్థాయి సమావేశంలో నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్, ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సముద్రపు రామారావు పాల్గొని, జిల్లాలో పార్టీ పరిస్థితిని అధిష్టానానికి వివరించారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. అనంతరం పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు.

దడ పుట్టిస్తున్న దొంగలు..!

- ఆలయాలు, ఆరు బయట ద్విచక్రవాహనాలే లక్ష్యం
- వ్యవసాయ క్షేత్రాల్లో మోటార్లు మాయం
- నెల్లిమర్ల–రణస్థలం రహదారిలో హల్‌చల్
- నిఘా పెంచాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు



వల్లూరు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గణేష్ (ఫైల్)



దేవుని నెలివాడ అమ్మవారి ఆలయంలో గత నెలలో దొంగ హల్‌చల్ (సీసీ ఫుటేజీ)

నెల్లిమర్ల రూరల్: మండలంలో దొంగలు హల్‌చల్ చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నారు. గతంలో ఇళ్లల్లో పడి దోచుకున్న దొంగలు ఇప్పుడు ఆలయాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉన్న విలువైన వస్తువులను దోచుకుంటున్నారు. నెల్లిమర్ల–రణస్థలం ప్రధాన రోడ్డులో ఈ తరహా దొంగతనాలు పెరిగిపోయాయి. ఆరు బయట ఉన్న ద్విచక్రవాహనాలు, ఆలయాల్లోని హుండీల్లో ఉన్న నగదు, వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లను ఎత్తుకుపోతున్నారు. గడిచిన కొద్ది నెలల నుంచి ఈ తరహా ఫిర్యాదులు నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌కు ఎక్కువగా వస్తున్నాయి. నెల్లిమర్ల–రణస్థలం రహదారి నిర్మానుష్యంగా ఉండడం దొంగలకు కలిసివస్తోంది. రాత్రి 7 దాటితే కొత్తపేట నుంచి వల్లూరు వరకు ప్రధాన రోడ్డులో జనాల తాకిడి ఉండదు. నెల్లిమర్ల పట్టణంతో పాటు కొత్తపేట, రామతీర్థం, సతివాడ, బొప్పడాం, తదితర గ్రామాల్లో ఆరు బయట ఉన్న ద్విచక్రవాహనాలను ఎత్తుకుపోతున్నారని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విలువైన మోటార్లు ఎత్తుకుపోతూ రైతులకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నారు. ఇటీవల ఆల్తిపాలెం కూడలి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ పెట్రోల్ బంకులో సుమారు రూ.60 వేలు విలువ చేసే కొత్త బ్యాటరీలను చోరీచేశారు. రాత్రివేళ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న దాబాలు, హోటళ్లలో మద్యం సేవిస్తున్న కొంత మంది వ్యక్తులు తమ అవసరాల కోసం తరుచూ దొంగతనాలు చేస్తున్నారని పెట్రోల్ బంకు నిర్వాహకులు అనుమానిస్తున్నారు.

ఆలయాలనూ వదలడం లేదు..

రామతీర్థం పంచాయతీ దేవుని నెలివాడ సమీపంలో ఉన్న ప్రసిద్ధ రాజరాజేశ్వరి ఆలయంలో ప్రతి రెండు, మూడు నెలలకోసారి దొంగతనాలు జరుగుతున్నాయి. ఆరు నెలల కిందట ఆలయంలో ఉన్న హుండీను ఎత్తుకుపోయారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వ్యక్తిని పట్టుకొని, సొత్తు రికవరీ చేశారు. మరో రెండు నెలలు పోయిన తరువాత కూడా అదే ఆలయంలో అమ్మవారి కిరీటం పట్టుకుపోవడం గమనార్హం. ఇక గ్రామాల్లో ఉన్న చిన్నచిన్న ఆలయాల్లో నిత్యం ఇదే వ్యవహారం కొనసాగుతోందని ప్రజలు చెబుతున్నారు. చేసేదేమీ లేక చిన్నచిన్న ఆలయాల్లో హుండీలను పెట్టడం మానేశారు. రాత్రిపూట పోలీసుల నిఘా లేకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని, గస్తీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు..

దొంగతనాల ఫిర్యాదులు ఎక్కువ కావడంతో సీసీ కెమెరాల ఏర్పాటుపై స్థానిక పోలీసులు దృష్టి సారించారు. గ్రామాల్లోని ఆలయాలు, చర్చిలు, ప్రధాన కూడళ్ల వద్ద స్థానికులతోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 13 గ్రామాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మిగిలిన గ్రామాల్లో కూడా కెమెరాల ఏర్పాటుకు ఆయా గ్రామ పెద్దలు, యువతకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు.

రాత్రి వేళల్లో నిఘా పెంచుతాం..



రాత్రి సమయాల్లో పట్టణంతో పాటు గ్రామాల్లో సిబ్బందితో గస్తీ నిర్వహిస్తున్నాం. ప్రత్యేకంగా డ్యూటీలను అప్పగించి ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసుకుంటున్నాం. ఆరు బయట ద్విచక్రవాహనాలు, పొలాల్లో మోటార్లు పోతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై దర్యాప్తు చేపట్టి కేసులను ఛేదిస్తున్నాం. రాత్రి సమయాల్లో మరింత నిఘా పెడతాం. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. పట్టణ పరిధిలో ప్రజలకు ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యం ఉంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని అవగాహన పెంచుకోవాలి.
– గణేష్, ఎస్‌ఐ, నెల్లిమర్ల

పీవీజీ జయంతి సభను విజయవంతం చేయండి

- డాక్టర్ పీవీజీ రాజు కళావేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి



సమావేశంలో మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: దేశ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేకత కలిగిన మహోన్నత వ్యక్తి, విజయనగరం సంస్థానాదీశుడు పీవీజీ రాజు 101వ జయంతి సభను విజయవంతం చేయాలని డాక్టర్ పీవీజీ రాజు కళావేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కోరారు. సోమవారం స్థానిక గురజాడ అప్పారావు గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మే ఒకటో తేదీ ఉదయం 11 గంటలకు గురజాడ జిల్లా గ్రంథాలయంలో పీవీజీ జయంతి సభను నిర్వహించనున్నట్లు చెప్పారు. పీవీజీ సేవలు, ఉదారత, నిబద్ధత, రాజకీయాల్లో తెచ్చిన మార్పులను నేటి తరం యువతీ యువకులకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. దేశ రాజకీయ చరిత్రలో పట్టాభిషేకం అయిన రాజు సోషలిస్టుగా మారి ప్రజాసేవ చేసింది ఒక్క పీవీజీ మాత్రమేనని తెలిపారు. ఏటా పీవీజీ జయంతిని పురస్కరించుకుని సమాజంలో వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాలు అందజేస్తున్నామని, ఈ ఏడాది కూడా పది మందిని ఎంపిక చేశామన్నారు. విశాఖపట్నం ఉత్తర ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, ప్రముఖ సాయంకాలం దినపత్రిక లీడర్ సంపాదకుడు వీవీ రమణమూర్తి, ప్రముఖ వయోలిన్ వాయిద్యకారుడు ద్వారం దుర్గప్రసాదరావు, ఎన్‌సీఎస్ సంస్థల అధినేత నారాయణం శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు గాడి ప్రసాదరావు, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు మరిచర్ల కృష్ణమూర్తినాయుడు, మహిళా అభ్యున్నతికి కృషి చేస్తున్న చీకటి చంద్రి కారాణిలను కమిటీ ఎంపిక చేసిందని చెప్పారు. గురువారం జరిగే పురస్కార ప్రధాన సభలో విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు వీరిని సత్కరిస్తారని తెలిపారు. సమావేశంలో వేదిక కార్యదర్శి కొత్త సునీల్‌కుమార్, సముద్రాల గురుప్రసాద్, పిడకల ప్రభాకరరావు, గురజాడ ప్రసాద్ పాల్గొన్నారు.

సబ్‌జైల్ తనిఖీ...



వంటగదిని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మి

విజయనగరం లీగల్: జిల్లా న్యాయ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.భబిత, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మి స్థానిక సబ్‌జైల్‌ను సోమ వారం సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి, చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదన్నారు. అదేవిధంగా సబ్ జైల్‌లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడెడ్ క్లినిక్‌లను తనిఖీ చేసి న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు నిర్వహిస్తున్న విధులపై ఆరా తీశారు. జైలులో ఉన్న వారికి ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంత రం వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను వినియోగించుకోండి

- ఎస్పీ వకుల్ జిందల్



ఎల్‌హెచ్‌ఎంఎస్ అవగాహన పోస్టర్

విజయనగరం క్రైమ్: వేసవి నేపథ్యంలో టూర్లు, సొంత గ్రామాలకు వెళ్లేవారు లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్‌ను వినియోగించుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ఇవ్వడంతో కుటంబ సభ్యులతో ఊర్లు వెళ్లేవారు.. దాబాలు, ఆరుబయట నిద్రించేవారు ఈ సిస్టమ్‌ను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ప్లే స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అందులో మీ పేరు, ఫోన్ నంబర్, లొకేషన్ అలాగే ఎప్పటి నుంచి ఎంతవరకు ఇంట్లో ఉండడం లేదన్న సమాచారాన్ని పంపి రిక్వెస్ట్ పంపాలన్నారు. వెంటనే మొబైల్‌కు రిజిస్టర్డ్ నంబర్ వస్తుందని, దీన్ని యూజర్ ఐడీగా వినియోగించుకోవచ్చని తెలిపారు. అలా రిక్వెస్ట్ పంపిన వారి ఇళ్లపై పోలీసులు నిఘా పెడతారని, దీంతో దొంగతనాలు జరగకుండా చూసుకోవచ్చన్నారు. మున్సిపాలిటీ, నగర పాలక సంస్థల్లో ఈ సదుపాయం ఉచితంగా పొందవచ్చన్నారు.

పట్టుబడిన దొంగ



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ శ్రీనివాస్, వెనుక ముసుగులో నిందితురాలు

విజయనగరం క్రైమ్: నగరంలోని ఫూల్‌బాగ్‌లో ఈ నెల 23న జరిగిన దొంగతనం కేసుకు సంబంధించి నిందితురాలిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ శ్రీనివాస్ వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఫూల్‌బాగ్‌లోని నక్కాన పైడిరాజు ఇంటిలో ఈ నెల 23న దొంగతనం జరిగింది. బీరువాలోఉన్న 11 తులాల బంగారు ఆభరణాలు పోయినట్లు బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై కృష్ణమూర్తి కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా.. బాధితురాలి తోటికోడలే దొంగతనం చేసినట్లు గుర్తించి, నగరంలోని రాజీవ్ క్రీడామైదానం వద్ద ఆమెను అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

వేసవి శిక్షణ తరగతులు ఉపయోగకరం



మాట్లాడుతున్న ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణ

డెంకాడ: మండలంలోని డెంకాడ శాఖ గ్రంథాలయంలో ఈనెల 29 నుంచి జూన్ 6వ తేదీ వరకు జరగనున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డెంకాడ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణ అన్నారు. డెంకాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. గ్రంథాలయంలోని కథలు, పోటీ పరీక్షల పుస్తకాలు, న్యూస్‌పేపర్లను చదివి విజ్ఞానం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.మహేష్ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



పుస్తకాలు, పెన్నులు అందుకున్న విద్యార్థులతో పీవీఎల్ సుబ్బారావు, తదితరులు

విజయనగరం టౌన్: విద్యార్థులకు వేసవిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చని ప్రముఖ కవి, ఉపాధ్యాయుడు పీవీఎల్ సుబ్బారావు అన్నారు. గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేటి తరాన్ని అన్నిరంగాల్లోనూ విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడానికి జిల్లా గ్రంథాలయం నిర్వాహకులు చేస్తున్న కృషి ఎంతో గొప్పదన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి మాట్లాడుతూ.. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6 వరకు 40 రోజుల పాటూ ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యార్థులకు కథలు చెప్పడం, చదివించడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, చెస్ తదితర అంశాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం పీవీఎల్ రాసిన జీవన సార్థకత పుస్తకాన్ని ఆవిష్కరించారు. అలాగే చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో పి.సన్యాసిరావు, బాషా, ఈశ్వర్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్షకు 218 మంది హాజరు



పర్యవేక్షిస్తున్న అధికారులు

నెల్లిమర్ల: జిల్లాలో ఉన్న ఏడు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఆరు నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్ల (బ్యాక్ లాగ్) భర్తీ కోసం సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 218 మంది విద్యార్థులు హాజరయ్యారు. 327 మంది దరఖాస్తు చేసుకోగా 109 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కన్వీనర్ డాక్టర్ కేబీబీ రావు ఆధ్వర్యంలో జరిగిన పరీక్షను బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పర్యవేక్షించారు.

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్ష



రిలే నిరాహారదీక్ష చేస్తున్న కార్మికులు

శృంగవరపుకోట: ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూ నేతలు సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఎన్‌ఎంయూ జిల్లా కార్యదర్శి పి.జి.రఫీ, కమిటీ సభ్యులు కె.ఆనంద్, డిపో కార్యదర్శి ఏ.రాజయ్య మాట్లాడుతూ ఉద్యోగ భద్రత 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, ఈహెచ్.ఎస్ స్థానంలో పాత వైద్యవిధానం అమలు చేయాలని కోరారు. నైట్ అవుట్ సర్వీసులకు రూ.150 నుంచి రూ.400 పెంపును అమలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులు ప్రభుత్వమే కొనుగోలు చేసి, నిర్వహించాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలంటూ కార్మికులతో కలిసి నినాదాలు చేశారు.

వితంతువులకు పింఛన్లు మంజూరు చేయండి

నెల్లిమర్ల రూరల్: వితంతవులకు తక్షణమే పింఛన్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెట్టిన నిబంధనలతో అర్హులకు పింఛన్లు అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నా పింఛన్ల కోసం అర్హులు ఎదురుచూడాల్సి వస్తోందని వాపోయారు.

కుట్టు మిషన్ శిక్షణా కేంద్రం ప్రారంభం

కొత్తవలస: స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయం వద్ద బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్.కోట నియోజకవర్గ స్థాయి ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కేంద్రంలో మొదటి విడతగా 140 మంది మహిళలకు 90 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామని చెప్పారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వితంతువులకు వంచన..!

- వితంతువులకు పింఛన్లు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- జిల్లాలో వితంతు ఫించన్ కోసం ఏడాదిగా 2 నుంచి 3 వేల మంది ఎదురుచూపులు
- పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే, ఆయన పింఛన్‌ను భార్యకు బదిలీ చేస్తారట..!
- పింఛన్ రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు పింఛన్ ఇవ్వరట..!
- ఇదెక్కడి చోద్యం అంటూ నివ్వెరపోతున్న వితంతువులు



గంట్యాడ: ''గంట్యాడ మండలంలో పెదవేమలి గ్రామానికి చెందిన సిరపురపు రాము అనే వ్యక్తి 2024 ఏప్రిల్‌లో మరణించాడు. అతను భార్య కాంతమ్మకు ఇంతవరకు పింఛను మంజూరు కాలేదు. ఏడాది కాలంగా పింఛన్ కోసం ఆమె ఎదురుచూస్తోంది.''

''పెదవేమలి గ్రామానికి చెందిన దోకుల నాయుడు అనే వ్యక్తి ఏడాది క్రితం మరణించాడు. అతని భార్య వరలక్ష్మికి ఇంతవరకు వితంతు పింఛన్ మంజూరు కాలేదు. సచివాలయంలో దరఖాస్తు చేయడానికి వెళితే కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించి, ఆన్ లైన్‌లో అప్‌డేట్ చేసు కునే ఆప్షన్ ఇంకా ఇవ్వలేదని అక్కడ సిబ్బంది చెప్పడంతో చేసేదేమీ లేక మిన్నుకుండి పోయారు.'' వీరు ఇద్దరే కాదు, జిల్లాలో అనేక మంది వితంతువులు పింఛన్ కోసం ఎదురుచూస్తు న్నారు. భర్తను కోల్పోయి ఎటువంటి ఆసరా లేని వారిని కూటమి సర్కార్ వంచనకు గురిచేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పింఛన్ పెంచడమే కాకుండా అర్హులందరికీ మంజూరు చేస్తామని ఎన్నికల ప్రచారంలో గొప్పలు చెప్పిన కూటమి పెద్దలు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికి కూడా కొత్త పింఛన్ మంజూరు చేయకపోగా, ఉన్న పింఛన్లు ఊడగొడుతున్నారు. కూటమి పెద్దల తీరు అధికారంలోకి రాక ముందు ఒకలా, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకలా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మళ్లీ అదే తీరు..

పింఛన్ల మంజూరు విషయంలో 2014లో అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు నాయుడు ఏవిధంగా వ్యవహ రించారో... ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ మళ్లీ తీరు చూపిస్తున్నారనే చర్చ ప్రజల్లో జరుగుతోంది. నాటి చంద్రబాబు పాలనను ప్రజలు మళ్లీ గుర్తు చేసుకుంటున్నారు. అప్పటిలో గ్రామాల్లో ఎవరైనా పింఛన్ పొందు తున్న వ్యక్తి చనిపోతే తప్ప మరొకరికి కొత్త పింఛన్ మంజూరు చేసేవారు కాదని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.వితంతు పింఛన్ మంజూరులో ఇప్పుడు కూడా అలాంటి మెలికే పెట్టారు. ఇది వితంతువుల పాలిట శాపంగా మారింది. వృద్ధాప్య పింఛను వచ్చిన వ్యక్తి చనిపోతే అతని భార్యకు మాత్రమే పింఛన్ మంజూరు చేస్తామని కూటమి సర్కార్ ప్రకటించింది. అంటే అది కొత్తగా పింఛన్ మంజూరు చేసినట్టు కాదు.ఆ కుటుంబంలో పింఛనుదారుడు మరణిస్తే దాన్ని అతని భార్యకు బదాలయిస్తున్నారంతే. పింఛన్ లేని వ్యక్తి చనిపోతే అతని భార్యకు పింఛన్ మంజూరు చేయడం లేదు.

వృద్ధాప్య పింఛన్‌దారు చనిపోతేనే...

ప్రస్తుతం వద్దాప్య పింఛన్ పొందుతున్న వ్యక్తి చనిపోతే,ఆయనకు భార్య ఉంటే ఆమెకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఎటువంటి పింఛన్ పొందని వ్యక్తులు చనిపోతే వారి భార్యకు వితంతు ఫించను మంజూరు చేయడం గురించి ఎలాంటి ఆదేశాలు రాలేదు.
– కల్యాణ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ

2 నుంచి 3 వేల మంది వరకు ఎదురుచూపులు

జిల్లా వ్యాప్తంగా 2 నుంచి 3 వేల మంది వితంతువులు పింఛన్ కోసం ఏడాదిగా ఎదురుచూస్తు న్నారు. పింఛన్ డబ్బులను పెంచేశామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం ... ఈ పదినెలల పాలనలో కొత్తగా ఒక్కరికీ పింఛన్ మంజూరు చేయలేదు. జిల్లాలో అధిక శాతం మంది పేద, మధ్య తరగతి వారే. వృద్ధులు, దివ్యాంగులతో పాటు వితంతువులను కూడా ప్రభుత్వం ఇబ్బంది లకు గురిచేస్తోంది. కుటుంబాన్ని పోషించే భర్త చనిపోతే ఆ మహిళకు ఆసరాగా ఉండాల్సిన ప్రభుత్వమే వారిని అవస్తలు పడేలా చేస్తోంది. పింఛన్ల మంజూరులో కూటమి సర్కార్ నిర్దయతో వ్యవహారిస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. పింఛన్ల విషయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనుస రించిన విధానమే సరైందని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. పింఛన్ బదాలయింపు వంటివి లేకుం డా అర్హులైన ప్రతీ ఒక్కరికీ పింఛన్ మంజూరు చేసేవారు. ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరయ్యేవని ప్రజలు అంటున్నారు.